

# 11. సత్యానికి చేరువగా

ఎనిమిదవుతూండగా ఫోన్ వచ్చింది సత్యం దగ్గర్నుంచి, నాన్న మరణవార్తతో వింటూనే కొయ్యబారిపోయాను. "ఎలా!" అన్న ప్రశ్నకి వాడేదో సమాధానం చెప్పాడ గానీ ఆ సమయంలో నాకేమీ అర్థం కాలేదు.

నేనూ, నా భర్త గౌతమ్ వెంటనే బయల్దేరి వచ్చాం. ఉన్న ఊర్లోనే కాబట్టి మేము అరగంటలో వచ్చేశాం కానీ అన్నయ్య రావడానికి టైం పడుతుంది.

ఇంకానయం. అదృష్టం కొద్దీ అన్నయ్య ప్రస్తుతం బెంగళూరులో వున్నాడు. అసలయితే వాడు అమెరికా నివాసి. కంపెనీ పని మీద ప్రస్తుతం ఒక ఆరునెలలు బెంగళూరులో వుంటున్నాడు.

అమ్మకి మొదటినుంచీ ఏదో ఒక అనారోగ్యం. స్థూలకాయం. బి.పి.... షుగరు.... కీళ్ళనొప్పులు. అవన్నీ కాకుండా రెండేళ్ళ నుంచీ వేధిస్తూన్న కిడ్నీ సమస్య.

కానీ నాన్న... నాన్న ఈ రోజు వరకూ ఆరోగ్యంగానే వున్నారు. అమ్మ సంగతంతా కూడా ఆయనే చూసుకునేవారు. అలాంటిది హటాత్తుగా ఈ రోజు!

రోజూలాగానే సాయంత్రం వాకింగ్‌కి వెళ్ళొచ్చారట. ఏడున్నరకి సత్యం భార్య సుశీల అన్నం పెట్టిందట. పొద్దున తిన్నదే సరిగా అరగలేదంటూ ఒక్క ముద్ద తిన్నారట. ఆ తర్వాత అన్నం అరిగేందుకు కాబోలు ఏదో టాబ్లెట్ వేసుకుంటానంటే సుశీల ఆయనకి మంచినీళ్ళు యిచ్చి వంటగదిలోకి వెళ్ళిందట. అంతే. నాన్న ఒక్కసారిగా కూలబడిపోయారట. ఆ శబ్దానికీ, ఆయన పక్కనే వున్న అమ్మ వేసిన కేకకీ సుశీలా, సత్యం పరుగెత్తుకు వచ్చారట. కార్డియాక్ అరెస్ట్ అన్నాడట డాక్టర్.

అనాయాస మరణం. ఎవరినీ యిబ్బంది పెట్టకుండా.... తను బాధ పడకుండా ఆయన అలా వెళ్ళి పోవడాన్ని గురించే మాట్లాడుకుంటున్నారు అందరూ.

"బాధ్యతలన్నీ తీరిపోయాయి. పిల్లలు చక్కగా సెటిల్ అయ్యారు." ఓదార్పుతో మిళితమై వినబడుతూన్న మాటలు.

నిజమే. అన్నయ్య అమెరికాలో మంచి ఉద్యోగంలో వున్నాడు. నేను భర్తా, పిల్లలతో హాయిగా, లోటు లేకుండా వున్నాను. తమ్ముడు సత్యం...అన్నయ్య అంత గొప్ప సంపాదనలో లేకపోయినా వాడి స్థితీ బాగానే వుంది. నిజానికి వాడూ చిన్నప్పటి నుంచీ చదువులో బాగా రాణించినవాడే. అన్నయ్య లాగా ఇంజనీరింగ్ మంచి మార్కులతో పాసైన వాడే. కాకపోతే అన్నయ్య పెద్ద కలలు కని వాటిని సాధించుకున్నాడు. సత్యం ఇండియా వదిలి వెళ్ళడం యిష్టం లేదంటూ ఇక్కడే వుండిపోయాడు.

"ఏంట్రా దేశం మీద ప్రేమా!" అని ఎవరయినా వెక్కిరిస్తే చిన్నగా నవ్వి "అవును" అనేవాడు. దేశం మీదే కాదు అన్నిటితోనూ అటాచ్‌మెంట్ ఎక్కువే వాడికి. అమ్మని కూడా ప్రాణప్రదంగా చూసుకుంటాడు. ఆవిడ కోసం హాస్పిటల్స్ చుట్టూ తిరగడం. వేళకి మందులు యివ్వడం.... నాన్న ఎంతగా చూసుకున్నా సత్యం కూడా చాలా సమయం కేటాయించవలసి వచ్చేది. అటు భార్యనీ, పిల్లల్నీ అంతే ప్రేమగా చూసుకుంటాడు. నాకు చేయవలసిన పెట్టుపోతలూ శ్రద్ధగా చేస్తాడు.

అన్నయ్యకి ఎంతసేపూ తన పనులూ.... ఉద్యోగం... అంతే. పైగా గత పదిహేనేళ్ళుగా వాడు విదేశాల్లోనే వున్నాడు. సత్యం మాత్రం ఒక్క రోజు కూడా అమ్మకీ, నాన్నకీ దూరంగా వుండలేదిప్పటి వరకూ. ఇప్పుడీ ఎడబాటుని ఎలా తట్టుకుంటాడో!

అన్నయ్య లాగా గలగలా మాట్లాడే అలవాటు లేదు. సినిమాలు, షికార్లు లాంటి సరదాలు లేవు. ఎప్పుడు చూసినా భారతం, భాగవతం లాంటి పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటాడు. లేదంటే సుశీల చేత భక్తి గీతాలూ, పద్యాలూ పాడించుకుని వింటూ వుంటాడు.

అన్నయ్య వీడికి పూర్తిగా విరుద్ధం. అన్నయ్య అసలు దేవుడినే నమ్మడు. పురాణాలు వగైరాలని పూర్తిగా కొట్టి పారేస్తాడు. పనే దైవం వాడికి. అందుకే అంత పైకొచ్చాడు. అంత సంపాదిస్తున్నాడు. అయితే సంపాదనకి తగ్గట్లు ఖర్చు కూడా పెడతాడు. ఫ్రెండ్సూ... పార్టీలు.. ప్రపంచమంతా తిరగడాలు... అవన్నీ కూడా ఎక్కువే వాడికి.

అలాంటి సరదాలేమీ లేని సత్యం ఈ షాక్ నుంచి తేరుకుని మనుషుల్లో పడడం కష్టమేననిపించింది నాకు. అసలు నేను వచ్చేసరికి బాగా ఏడుస్తూ వుంటాడేమో

అనుకున్నాను. నా దు:ఖం కన్నా ముందు వాడినెలా ఓదార్చాలా అని భయపడుతూ వచ్చాను.

గేట్ తీసుకుని లోపలికి వచ్చి, అచేతనంగా పడుకుని వున్న నాన్నని చూడగానే ఒక్కసారిగా ఏడుపు తన్నుకొచ్చింది నాకు. అయిదు నిమిషాల తర్వాత తేరుకుని "సత్యం ఏడీ!" అంటే "బాబాయి ఫోన్ దొరకడం లేదట. ట్రై చేస్తున్నాడు" అంది అమ్మ.

నేను వచ్చిన కాసేపటికి మామయ్యలిద్దరూ వచ్చారు. మొత్తం కార్యక్రమమంతా వాళ్ళ చేతుల్లోకి వెళ్ళింది. ఏం చేయాలో, ఎలా చేయాలో తెలిసిన వాళ్ళు కనుక సత్యం అన్నిటికీ వాళ్ళనే సలహా అడుగుతున్నాడు. అన్నయ్య వచ్చేసరికే అన్నీ సిద్ధం చేశారు. అసలు కార్యక్రమం మాత్రం అన్నయ్య చేశాడు. నిజానికి అసలు అన్నయ్యకి కర్మకాండల మీద నమ్మకమూ లేదు. ఆసక్తీ లేదు. కానీ పెద్దకొడుకు కాబట్టి తప్పలేదు.

నాన్న శవం చూడగానే నాకన్నా ఎక్కువగా ఏడ్చేశాడు అన్నయ్య. ఆ తర్వాత కూడా కదిలిస్తే కళ్ళనీళ్ళు పెట్టుకుంటూనే వున్నాడు. రోజూ ప్రొద్దున్నే, చేయాల్సిన కార్యక్రమం కాస్తా చేసి రావడం.. అన్నం తినడం.. ఇక రోజంతా దిగులు పడుతూ కూర్చోవడం... ఇదే వాడి దినచర్య.

అన్ని విషయాలూ సత్యం ఒక్కడే చూసుకుంటున్నాడు. అన్నీ సక్రమంగా, శాస్త్రోక్తంగా చేయాలని ఆరాటపడుతూ.. తెలియని విషయాలు పెద్దవాళ్ళని అడుగుతూ.. దుఃఖపడటానికి సమయమే లేనివాడిలా తిరుగుతున్నాడు సత్యం.

ఆలోచిస్తూంటే గుర్తొస్తోంది. వాడసలు ఒక్క కన్నీటి బొట్టు కూడా జార్చలేదు నాన్న పోయాక. వాడికంటే పెద్దవాళ్ళమయిన అన్నయ్యా.. నేనూ మాత్రం ఎవరు పలకరించడానికొచ్చినా ఏడ్చేస్తున్నాం. మధ్యలో ఎపుడో సత్యం అన్నాడు కూడానూ.. "అలా ఏడవకూడదక్కయ్యా, ఏడవకు." అని.

వాడలా అన్నాక, వాడి నిబ్బరం చూసి నేనూ కాస్త దుఃఖం తగ్గించుకున్నాను. నిజమే. పుట్టిన ప్రతివారికీ మరణం సహజమని తెలుసు. నాన్న మరణించినా, మేము బ్రతకడమూ.. మా జీవితాన్ని కొనసాగించడమూ, తప్పదనీ తెలుసు. మరి ఇంక ఏడవడం ఎందుకు! ఏడవవలసిన అవసరం లేకపోయినా ఏడవడం అజ్ఞానమే కదా! ఈ రకంగా మనసుకి నచ్చచెప్పుకోవడం మొదలుపెట్టాక నా దుఃఖం కొద్దిగా తగ్గింది.

అన్నయ్య మాత్రం మొదటి రోజున వున్న దుఃఖం నుంచి కాస్త కూడా తేరుకోలేదు. తను సాధించలేనిదీ, తనకు చేతకానిదీ ఏమీ లేనట్లు ధీమాగా తిరిగే అన్నయ్య... దేవుడినీ, ఋషులనీ కూడా ఎగతాళి చేస్తూ.. జోకులేస్తూ మాట్లాడే అన్నయ్య... ఒక్కసారిగా శక్తంతా

లాగేసినవాడిలా అయిపోవడం చూస్తే మొదటి రోజు చాలా బాధగా అనిపించింది. కానీ రాన్రానూ ఒకరకమైన చిరాకు కూడా మొదలయింది.

చిరాకెందుకంటే స్పష్టంగా చెప్పలేను. కానీ కలుగుతోంది. వాడి దుఃఖం నాకు అర్థమవుతోంది. కానీ అది అనవసరమనీ అనిపిస్తోంది.

దుఃఖం ఒక్కటే కాదు. కోపంతోనూ రగిలిపోతున్నాడు అన్నయ్య. మొదటిరోజు... హడావుడి అంతా అయ్యాక, నాన్నగారు అసలు ఎలా పోయారన్న చర్చ వచ్చింది. అన్నం తినగానే టాబ్లెట్ వేసుకున్నారని విని "ఏం టాబ్లెట్!" అని అడిగాడన్నయ్య.

నాన్నగారు వేసుకున్న టాబ్లెట్ తెచ్చి చూపించింది అమ్మ. ఈలోపల అమెరికానుంచి వాడి ఫ్రెండ్ ఫోన్ చేశాడు., వాడిని పలకరించడానికి. అతనితో మాట్లాడగానే అన్నయ్య చాలా అసహనంగా మారిపోయాడు.

ఆ టాబ్లెట్ వలన కొంతమందికి గుండెకి సంబంధించిన యిబ్బంది కలిగే అవకాశం వుందన్నాడట అతను. "ఏ టాబ్లెట్ పడితే ఆ టాబ్లెట్ ఎలా వేసుకోనిచ్చారసలు!" అంటూ అందరిమీదా విరుచుకు పడ్డాడు అన్నయ్య. సుశీల నివ్వెరపోయింది. అమ్మ కల్పించుకుని "డాక్టర్ రాసిచ్చిన టాబ్లెట్టేరా అది. నాన్నగారు ఎప్పటినుంచో వేసుకుంటున్నారు." అంది.

"ఏ డాక్టర్ రాసిచ్చాడు!?"

"ఇంతకుముందు చిక్కడపల్లిలో వుండగా ఒక డాక్టర్‌కి చూపించుకునేవారు కదా! ఆయన రాసిచ్చారు."

"చిక్కడపల్లి వదిలి నాలుగేళ్ళయింది. అపుడెపుడో ఎవరో చెప్పినదాన్ని యిపుడు యిష్టం వచ్చినట్లు మెడికల్ షాప్‌లో కొనుక్కుని వేసేసుకుంటారా!" అన్నయ్య కస్సుమన్నాడు.

అందరం సమాధానం చెప్పలేనట్లు చూస్తుంటే... "మరి కార్డియాక్ అరెస్ట్ అన్న డాక్టరెవడు?" అని గర్జించాడు మళ్ళీ.

"అది.. ఈ కాలనీలో వుండే డాక్టరుగారు. మామయ్యగారు పడిపోగానే మీ తమ్ముడు ఆ డాక్టరుగారిని పిల్చుకొచ్చారు." సుశీల చెప్పగానే అన్నయ్య ఆ డాక్టర్ దగ్గరికి బయల్దేరాడు.

"కార్డియాక్ అరెస్ట్ అని అలా ఎలా నిర్ణయించేశాడు? అసలు నాన్న ఏం టాబ్లెట్ వేసుకున్నారో.. అది వేసుకోవచ్చో లేదో యివన్నీ చూడాలి కదా! నేను కనుక్కుంటాను." అంటూ వెళ్ళాడు.

ఆ డాక్టరుగారు వూర్లో లేరట. ఇల్లు తాళం పెట్టి వుంది. వెళ్ళినంత వేగంగా తిరిగి వచ్చాడు కానీ అన్నయ్య శాంతించలేదు. "నేను దీన్ని యిలా వదిలిపెట్టను. కేసు పెడతాను. ఇంత ఘోరమా!" అంటూ బాధ పడుతూనే వున్నాడు.

ఈ గొడవంతా జరిగినపుడు సత్యం ఇంట్లో లేడు. వాడు రాగానే అన్నయ్య చాలా నిష్ఠూరంగా మాట్లాడాడు. "అమ్మావాళ్ళకి అంటే తెలీదు. ఇంత చదువుకున్న వాడివి నీకన్నా తెలియాలి కదా!" అని విసుక్కున్నాడు.

"నాన్న టాబ్లెట్స్ సంగతి నేనెపుడూ పట్టించుకోలేదన్నయ్యా. నాన్నే చూసుకునేవారు." అన్నాడు సత్యం కూడా బాధపడుతూ.

"అదే. ఆ నిర్లక్ష్యం వల్లనే నాన్న పోయారు." అన్నాడు అన్నయ్య విసురుగా. "అనారోగ్యంతో చనిపోలేదు నాన్న. నీ నిర్లక్ష్యం వల్ల పోయారు."

అందరం నివ్వెరపోయాం అన్నయ్య మాటలకి. ఆ ఆరోపణ వినగానే సత్యం మొహం పాలిపోయింది.

"అవేం మాటలురా! వూరుకో." అన్నాడు మామయ్య.

"దైవ నిర్ణయం అలా వుంది. ఏం చేస్తాం!" అన్నాడు బాబాయ్.

అందరివైపూ నిరసనగా ఒక్క చూపు చూసి "ఛీ" అన్నాడు అన్నయ్య. "ఇదిగో యిలా మాట్లాడతారు కాబట్టే యిక్కడ డాక్టర్లు కూడా ఇంత నిర్లక్ష్యంగా వుంటారు. అరె! ఒక ప్రాణం పోవడం అంటే ఏమిటో అర్థం అవుతోందా మీకసలు!"

అన్నయ్య పెద్దపెద్దగా అరుస్తుంటే మాకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు. ఆవేశంలో నుంచి మళ్ళీ దుఃఖంలోకి జారిపోయాడు అన్నయ్య. "ఎంత ఘోరం! నేను దీన్ని యిలా వదిలిపెట్టను" అంటూనే వున్నాడు.

ఆరోజు నుంచీ అందరితోనూ ముభావంగా వుంటున్నాడు. వాడి దృష్టిలో ఎవరు దోషో అర్థం కావడం లేదు. సత్యం మీదేనా కోపం! లేకపోతే మా అందరి తప్పూ కూడా వుందనుకుంటున్నాడా!

నాకు అర్థం కావడం లేదు. ఇందులో నిజంగా సత్యం తప్పు వుందా! నాన్నని తన దగ్గర వుంచుకున్నాడు కాబట్టి సత్యమే యివన్నీ చూసుకుని వుండాలా! మరి ఆ మాటకొస్తే నాన్నని తన దగ్గర వుంచుకోకుండా సత్యం దగ్గర వుంచడం అన్నయ్య నిర్లక్ష్యం కాదా! సత్యం కూడా ఆ మాట అనచ్చు కదా!

రకరకాల ఆలోచనలు. కానీ చిత్రం ఏమిటంటే అన్నయ్య ఎన్ని సూటిపోటి మాటలు అన్నా సత్యం ఒక్కసారి కూడా నిగ్రహాన్ని కోల్పోలేదు.

మొత్తానికి కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. చుట్టాలందరూ వెళ్ళిపోయారు. నేను కూడా మాయింటికి చేరాను. కాకపోతే రోజూ మధ్యాహ్నం పూట కాసేపు వచ్చి అమ్మ దగ్గర కూర్చుని వెళ్తున్నాను.

ఇవాళ సాయంత్రం నాలుగుగంటలకి నేను వచ్చేసరికి అమ్మ లోపలి గదిలో పడుకుని వుంది. అన్నయ్యా, వదినా మేడమీద గదిలో వున్నారు. నేనిలా లోపలికి వచ్చానో లేదో, మళ్ళీ వాకిట్లో ఆటో ఆగిన శబ్దం విని.. ఎవరా అని చూశాను.

శోభ!... వదినా వాళ్ళ అక్కయ్య!

శోభావాళ్ళు కూడా అమెరికాలోనే వుంటారు. సెలవులకి ఇండియా వచ్చారట. అమ్మని పలకరించేందుకు వచ్చినట్లుంది.

తనకి మంచినీళ్ళిస్తూ, "అమ్మ పడుకుంది, లేపుతాను." అన్నాను.

శోభ వారించింది. "మావారు, మా అమ్మా కూడా వస్తామన్నారు. నాకు వేరే పనుంటే చూసుకుని, అక్కడినుంచి వస్తున్నాను. వాళ్ళు డైరెక్ట్‌గా యింటినుంచి వస్తామన్నారు. వాళ్ళు కూడా వచ్చాక లేపవచ్చునులేండి." అంది.

అన్నయ్య వాళ్ళ మామగారు కూడా సంవత్సరం క్రిందటే పోయారు. అప్పుడు శోభ యిక్కడికి వచ్చి, వాళ్ళ అమ్మని తనతో పాటూ అమెరికా తీసుకువెళ్ళింది.

"మీ అమ్మగారు ఎలా వున్నారు?" అని అడిగాను.

"చాలా బెటర్" శోభ జవాబిస్తూండగా, అన్నయ్య, వదిన కూడా క్రిందికి వచ్చారు.

"అక్కడికి తీసుకువెళ్ళాక అమ్మకి అసలు తీరిక అనేది లేకుండా చేసేశాను. మొదట్లో కొన్ని రోజులు చాలా నిరాసక్తంగా కనిపించేది. కానీ ఆతర్వాత్తర్వాత పనిలో పడి మెల్లగా ఆ ఆలోచనలన్నీ మర్చిపోయింది. మరోప్రక్క నించి కౌన్సిలింగ్ కూడా యిప్పించాను. కౌన్సిలింగ్‌లో చెప్పారు. మరణాన్ని ఎదుర్కోవడంలో రకరకాల స్టేజెస్ వుంటాయిట.

మొదట... జరిగినదాన్ని నమ్మలేని, ఒప్పుకోలేని స్థితి. తర్వాత, ఎందుకిలా జరిగిందన్న కోపం.. బాధ. అవన్నీ దాటాక, అన్నిటికన్నా చివరి స్థితి – జరిగినదాన్ని అంగీకరించడం.. నిజాన్ని స్వీకరించడం. అమ్మ ఇపుడు ఆ స్టేజికి వచ్చేసింది. నాన్నగారి మరణాన్ని కాక ఆయన వున్నప్పటి మంచి విషయాలన్నిటినీ ఆనందంగా గుర్తు చేసుకుంటోంది."

శోభ మాటలని మేము ముగ్గురం ఆసక్తిగా విన్నాం. ఇంకా చాలా విషయాలు చెప్పింది శోభ.

కౌన్సిలింగ్‌లో చెప్పినవే కాకుండా, తను కూడా కొన్ని విషయాలు గమనించిందట. ఎందుకిలా జరిగింది! నాకే ఎందుకిలా జరిగింది! అన్న బాధలోనుంచి బయటపడడంలో భాగంగా, మరణించినవారి తప్పులని వెతకడం కూడా జరుగుతుందట. 'ఆయన అప్పుడు అలా చేశారు. ఇప్పుడిలా చేశారు' అంటూ ఆయన దోషాలన్నిటినీ తల్చుకుని, ఆయన లేకపోవడమే బాగుందని సర్ది చెప్పుకుంటారట. తన బాధలో నుంచి బయటపడడానికి మనిషి తనకి తెలియకుండానే చేసే ప్రయత్నమట అది.

వాళ్ళ అమ్మని అబ్జర్వ్ చేసినపుడు శోభకి అర్థమయిన విషయమట అది. 'అది సహజం. సత్యం' అన్నట్లు శోభ ఆ విషయాన్ని ఒక సిద్ధాంతంలా చెప్తుంటే, నాకు ఆశ్చర్యంగా అనిపించింది.

చనిపోయినవారి దోషాలు తల్చుకుని, వాళ్ళు లేకపోతేనే బాగుందనుకోవడం... కరెక్టేనా! అలా ఆలోచించడం మొదలుపెడితే... అసలు ఏ దోషం లేని మనుషులెవ రుంటారు!

గరుడపురాణం చదువుతూ సత్యం, చనిపోయినవారి గుణాలే కానీ దోషాలు తలవకూడదని చెప్పడం గుర్తొచ్చింది. గొంతు సవరించుకుని నా సందేహం బయటపెట్టాను.

శోభ నవ్వింది. "దోషాలు తలవడం మంచి పద్ధతి అని చెప్పడం లేదు. మరణాన్ని యాక్సెప్ట్ చేసి, చనిపోయినవాళ్ళ గురించి ఆనందంగా తల్చుకోవడం చివరి స్టెప్. ఆ స్టెప్‌కి చేరేముందు మనుషులు యిలాంటి స్థాయిలన్నీ దాటుతారని చెప్తున్నాను." అంది.

కాసేపటికి వాళ్ళ అమ్మగారూ, శ్రీవారూ వచ్చారు. ఆవిడని చూసి ఆశ్చర్యపోయాను నేను. నిజంగానే చాలా మారిపోయిందావిడ.

ఇదివరకటికన్నా సన్నబడింది. హుషారుగా వుంది. ఇదివరకు పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకునేది. ఇప్పుడు అంత పెద్ద బొట్టు కాకుండా చిన్న టిక్లీ పెట్టుకుంది. అందుకేనేమో నాజూగ్గా, చిన్నదానిలా కనిపిస్తోంది. చూపులకే కాదు.. ప్రవర్తనలోనూ, మనస్తత్వంలోనూ కూడా పదేళ్ళు చిన్నదైపోయిందనిపించింది నాకు ఆవిడని చూస్తే.

సత్యం వెళ్ళి అమ్మని నిద్ర లేపి తీసుకువచ్చాడు. మళ్ళీ నాన్న మరణం గురించిన చర్చా, ఇండియాలో డాక్టర్ల నిర్లక్ష్యాల గురించిన చర్చా వచ్చాయి.

"మీ అమ్మగారిని అమెరికా తీసుకు వచ్చేయండి. కనీసం ఆవిడనన్నా జాగ్రత్తగా చూసుకోండి" అంది శోభ అన్నయ్యతో.

అన్నయ్య వాళ్ళ అత్తగారు అమ్మవైపు తిరిగి, "అవునండీ, హాయిగా అక్కడికి వచ్చేయండి. మా అమ్మాయి మిమ్మల్ని చక్కగా చూసుకుంటుంది," అంది వదిన తరపున భరోసా యిస్తూ.

నేను గబుక్కున సత్యం వైపు చూశాను. కానీ వాడు యిదేమీ వినిపించుకోలేదు. గేటు చప్పుడవడంతో వాకిట్లోకి వెళ్ళాడు. జగన్నాథం మామయ్య వచ్చాడు. అమ్మకి చిన్నాన్న కొడుకు. అమ్మకి ఆయనంటే చాలా అభిమానం. తలుపు దాకా వచ్చిన మామయ్య యింట్లో చాలామంది వుండటం చూసి, "యిలా కూర్చుందాం రారా!" అంటూ మళ్ళీ వాకిట్లోకి నడిచాడు. సత్యం రెండు కుర్చీలు తీసుకెళ్ళి మామిడిచెట్టు దగ్గర వేశాడు.

పరామర్శ ముగిసి, వదిన, శోభ, వాళ్ళ అమ్మ మామూలు కబుర్లలో పడ్డారు. అక్కడ తన దినచర్య గురించి చెప్తోంది వాళ్ళ అమ్మ. రోజూ వంట తనే చేస్తుందట. క్రొత్తగా నేర్చుకున్న వంటల గురించీ, చూసిన సినిమాల గురించీ, ప్రదేశాల గురించీ చెప్పింది. "జీవితాన్ని ఎలా ఆనందించాలో అమ్మకి యిప్పుడు బాగా అర్థమయింది" అంది శోభ నవ్వుతూ.

"నీకు తెలుసా! అమ్మ కథలు వ్రాస్తోంది" అంది మళ్ళీ తనే.

"అవునా!" వదిన ఆశ్చర్యపోయింది.

"ఊ. కవిత కూడా పబ్లిష్ అయింది." బ్యాగ్‌లో నుంచి పేపర్ తీసి వదిన చేతికిస్తూ చెప్పింది.

వదినకి తెలుగు చదవడం రాదు. ఒక్క క్షణం ఆ కాగితాన్ని చూసి, నాకు అందించింది.

ఆసక్తిగా చదివిన నేను నివ్వెరపోయాను. టీనేజ్ అమ్మాయి వ్రాసిన ప్రేమ కవితలా వుందది.

ఆ కాగితం అమ్మ చేతికిచ్చి, నేను వంటగదిలోకి నడిచాను.

సుశీల కాఫీ తయారు చేసి కప్పుల్లో పోస్తోంది. వంటగదిలో నిల్చున్నా, వాళ్ళ మాటలు వినిపిస్తూనే వున్నాయి.

చిన్నప్పటి స్నేహితులందరితోనూ మళ్ళీ కాంటాక్ట్స్ ఏర్పడ్డాయట ఆవిడకి. ఈవారం అందరూ ఏదో రిసార్ట్‌లో కలుసుకునేందుకు ప్లాన్ కూడా చేసుకున్నారట.

ఇప్పటివరకూ గడిపింది జీవితమే కానట్లూ, ఏ బాధ్యతలూ లేకుండా హాయిగా తిరిగే అవకాశమున్న శేషజీవితమే స్వర్గమన్నట్లుగా మాట్లాడ్తోందావిడ.

"నీ యిష్టమమ్మా, నీ యిష్టం వచ్చినట్లు ఎంజాయ్ చేయి. నీకెంత డబ్బు కావాలన్నా మేము యిస్తాం" అని భరోసా యిస్తున్నారు పిల్లలు.

అన్నయ్య కూడా మామయ్య వాళ్ళ దగ్గరికి చేరాడు. అందరికీ కాఫీలందించి, నేనూ ఓ గ్లాసు పట్టుకుని మామయ్య వాళ్ళ ప్రక్కనే కూర్చున్నాను.

ఈ రెండు నిమిషాలలోనే అన్నయ్య ఏమన్నాడో కానీ.. "ప్రాణం పోవడం.. ఆగడం మన చేతుల్లో వుందా! ప్రారబ్ధం ప్రకారం జరుగుతుంది." అంటూ మామయ్య నచ్చచెప్తున్నాడు.

ఇదే మాట అన్న బాబాయ్ మీద విరుచుకు పడినట్లు, మామయ్య మీద విరుచుకు పడలేదు అన్నయ్య.

మామయ్య మాటల్లో.. మాట్లాడే పద్ధతిలో ఏదో శక్తి వుంది. నిజాన్ని నిజంగా మాట్లాడేస్తాడు. అందులో వూగిసలాట వుండదు.

మొన్నొకరోజు సత్యం యిదే చెప్పాడు నాతో. అమ్మకి బాగా సీరియస్ అయినపుడు ఒకసారి మామయ్య వచ్చాడట.

అమ్మ మామయ్య చేతులు పట్టుకుని "నేను వెళ్ళిపోతే నా పిల్లల్ని కాస్త కనిపెట్టుకుని వుండు" అందట.

ఇంకొకరెవరైనా అయితే.. "అదేం మాట అక్కయ్యా! నీకేం కాదు" అంటారు. లేకపోతే "అయ్యో! ఎందుకు చూసుకోం! నువ్వు ప్రత్యేకంగా చెప్పాలా!" అంటారు.

మామయ్య మాత్రం "నేనేమన్నా యిక్కడ పీఠం వేసుకుని కలకాలం వుండిపోతానా! అందరం వెళ్ళాల్సిన వాళ్ళమే కదా!" అన్నాడట.

ఆ క్షణంలో అమ్మ మంచం ప్రక్కన దిగులుగా కూర్చున్న సత్యానికి ఆమాట వినగానే మనసు ఏదోలా అయ్యి వణికిందట. కానీ అదేమాటని మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటే.. మెల్లమెల్లగా అందులోని నిజం అర్థమయి, మనసు గట్టిపడిందట. నాన్న పోయినప్పుడు కూడా వాడికి దుఃఖం రాలేదట.

మామయ్య మాటలు సత్యం మీద చూపించినంత ప్రభావం అన్నయ్య మీద చూపించే అవకాశం లేదు కానీ.... ఎందుకో అన్నయ్య కూడా మాతో మాట్లాడినంత దురుసుగా మామయ్యతో మాట్లాడటం లేదు.

అలా అని, మామయ్య మాటలు ఒప్పుకోనూ లేదు. "నేనలా అనుకోలేను మామయ్యా!" అన్నాడు ఖచ్చితత్వం ధ్వనించే గొంతుతో.

"కానీ అదే నిజం రా" అన్నాడు మామయ్య అంతకన్నా ఖచ్చితంగా.

"ఎలా మామయ్యా! చూడు, పోనీ అమ్మ విషయంలో అయితే తనకి చాలా ఆరోగ్య సమస్యలున్నాయి. కాబట్టి ఒకవేళ తనకి ఏమైనా జరిగినా అలా సర్ది చెప్పుకోవచ్చు. కానీ నాన్న! ఆరోగ్యంగా వున్న నాన్న వున్నట్లుండి చనిపోతే, మన చేతుల్లో ఏం లేదని ఎలా అనుకుంటాం!" అన్నాడు అన్నయ్య, 'ఇంత లాజిక్ లేని మాటలు మీరసలు ఎలా మాట్లాడతారు' అని వాపోతున్నట్లుగా చూస్తూ.

మామయ్య కనీ కనిపించకుండా నవ్వి, "నాకయితే నీ ప్రశ్న లోనే సమాధానమూ కనిపిస్తోందిరా! అంత అనారోగ్యంతో వున్న అమ్మ కాకుండా ఆరోగ్యంగా వున్న నాన్న పోవడంలోనే.. మనకి ఆ విషయం బాగా అర్థం కావాలి కదా!" అన్నాడు.

అన్నయ్య ఒక్క క్షణం మాటలు రానివాడిలా చూశాడు. ఆ తర్వాత తడబడుతూ ఏదో చెప్పబోయాడు కానీ, బహుశా అది వాడికే కన్విన్సింగ్‌గా ధ్వనించలేదు.

నా ఆలోచనలు మాత్రం మామయ్య మాటల దగ్గర నిలబడిపోయాయి. ఈ పదిహేను రోజుల అనుభవాలూ ఒక్కసారి కళ్ళముందు మెదిలాయి.

మొదట్లో ఏమనుకున్నాను నేను! అటు దేవుడి దగ్గర నుంచి.. ఇటు పసిపిల్లల దాకా అందరితోనూ ప్రేమగా వుండే సత్యం ఈ బాధ నుంచి తేరుకోలేడనుకున్నాను. ఏదీ పట్టనట్టుగా వుండే అన్నయ్య.. దేనిమీదా నమ్మకం లేని అన్నయ్య.. మరణాన్నీ అంతే తేలిగ్గా తీసుకుంటాడనుకున్నాను.

కానీ.... కానీ!

శోభ మాటలు గుర్తొచ్చాయి నాకు. దుఃఖం, నిర్లిప్తత, కోపం.. యిలాంటి స్టేప్స్ అన్నీ దాటితేగానీ ఆనందం దాకా వెళ్ళలేరన్న సిద్ధాంతం గుర్తొచ్చింది. అన్నయ్య ప్రవర్తన అలాగే వుంది. తన బాధకి ఎవర్నో దోషుల్ని చేయాలనే ప్రయత్నం.. ఒకరకంగా ఆలోచిస్తే, నాన్నకి తను ఏనాడూ ఏమీ చేయలేదన్న న్యూనత కూడా వాడి మనసులో ఏమూలో వుందేమో! అది ఎదుటివారు ఎక్కడ ఎత్తి చూపుతారోనన్న భయమే వాడి చేత అలా మాట్లాడిస్తోందేమో!

ఇక్కడే కాదు... యిలాంటి ధోరణులు తాతయ్య పోయినపుడు, మా మామగారు పోయినపుడు కూడా గమనించాను నేను. ఎవరు బాధ్యతగా అన్నీ చేశారో, వాళ్ళనే పట్టుకుని నిష్పూచీగా వుండేవాళ్ళు నానామాటలూ అన్నారు. అయితే ఆ సందర్భాల్లో మాటలు పడ్డవాళ్ళు కూడా వూరుకోలేదు. తిరగబడి పోట్లాడారు. గోల చేసుకున్నారు.

కానీ ఇక్కడ అలా కాకుండా అంతా ప్రశాంతంగా జరిగిపోవడానికి కారణం సత్యం. వాడి నిగ్రహం. ఎంత పరిపక్వతతో ప్రవర్తిస్తున్నాడు వాడు! శోభ చెప్పిన స్టెప్స్ అన్నీ వాడు మనసులోనే దాటేశాడా! లేకపోతే వాటి అవసరం లేకుండానే చివరి స్థాయికి చేరుకున్నాడా!

అవును. మేమందరం యింకా షాక్ నుంచి తేరుకోకముందే, వాడు జరిగినదాన్ని యాక్సెప్ట్ చేసేశాడు. అయిపోయినదాన్ని అంగీకరించి, జరగవలసినదాని మీద దృష్టి పెట్టాడు.

ఆధ్యాత్మికత! అదే నేర్పిందా వాడికీ సూక్ష్మాన్ని!

సత్యంవైపే అబ్బురంగా చూస్తూ నేను ఆలోచిస్తూండగా... అమ్మావాళ్ళు బయటికి వచ్చారు.

"మేము బయల్దేరతామండీ!" అంది శోభ. అందరం తలలు వూపి లేచి నిల్చున్నాం. శోభా వాళ్ళు వెళ్ళి కార్లో కూర్చున్నారు.

కారు కనుమరుగయేంతవరకూ హుషారుగా చేయివూపుతున్న అత్తగారి వైపు ఆరాధనగా చూశాడు అన్నయ్య. "అవునమ్మా, నువ్వు మాతో వచ్చేసేయి." అన్నాడు శోభ మాటల్ని మననం చేసుకుంటూన్నవాడిలా, తలకాయ వూపుతూ.

ఒక్క క్షణం గంభీరంగా చూసింది అమ్మ వాడివైపు. ఆతర్వాత స్పష్టంగా, తడబాటు లేకుండా చెప్పింది.

"కాదులేరా. నేను సత్యం దగ్గరే వుంటాను."

అమ్మ సమాధానం విన్న నాగుండె వుద్వేగంతో వణికింది. ఒక్క పరుగుతో అమ్మ దగ్గరికి వెళ్ళాను. అభినందిస్తున్నట్లుగా ఆమె చేయి పట్టుకున్నాను. నీళ్ళు తిరిగే కళ్ళతో అమ్మని చూస్తూ "అవునమ్మా, నువ్వు సత్యానికి దగ్గరగానే వుండు. దూరంగా వెళ్ళకు." అనుకున్నాను.

**- ఆదివారం ఆంధ్రజ్యోతి**

*13 నవంబర్ 2011*